

మన్సూరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్

## మొక్కలు నాటిన ఎంపీ జోగినపల్లి

### ఫొటో, వీడియో ట్రేడ్ ఎక్స్‌పోను ప్రారంభించిన సంతోష్ కుమార్

మన్సూరాబాద్, అక్టోబర్ 6: ఎల్బీనగర్, మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫొటో టెక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమానికి రాజ్యసభసభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను పురస్కరించుకుని స్టాళ్లలో ఏర్పాటు చేసిన వివిధ రకాల కెమెరాలు, వీడియో కెమెరాలు, అల్బమ్స్‌తో పాటు ఇతర పరికరాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో ప్రదర్శిస్తున్న అత్యాధునిక ఫొటో కెమెరాలు, వీడియో కెమెరాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. అనంతరం కేబీఆర్ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంక్షేమ శాఖ చైర్మన్ పల్లె రవికుమార్, రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యుడు కె. కిషోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌కే హుస్సేన్, వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఫొటోటెక్ అధినేత జి. అభిమన్యురెడ్డి, సౌత్ ఇండియా అధ్యక్షుడు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష పరిశోధనలలో ఇస్రో నిబద్ధత అద్భుతం

జూబ్లీహిల్స్, అక్టోబర్ 6: చంద్రుడిపై అడుగు పెట్టేందుకు చంద్రయాన్-3, సూర్యునిపై అధ్యయనం కోసం ఆదిత్య ఎల్-1 ప్రయోగించిన ఇస్రో ఇప్పటివరకు 424 ఉపగ్రహాలను ప్రయోగించిందని యూఆర్ఎస్‌సీ-ఇస్రో గ్రూప్ డైరెక్టర్ జయంతి రాజేశ్ పేర్కొన్నారు. చెన్నైలోని వీఐటీలో శుక్రవారం నిర్వహించిన టెక్నో విట్-23.. టెక్నికల్ ఫెస్ట్‌ను జోస్ రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇస్రో ఇప్పటివరకు 34 దేశాల సహకారంతో 260 ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేసిందని.. అంతరిక్ష పరిశోధనలలో ఇస్రో కొనసాగిస్తున్న నిబద్ధత అద్భుతమని కొనియాడారు.

## కరాటేలో వీఐటీ - ఏపీ విద్యార్థి ప్రతిభ

జూబ్లీహిల్స్, అక్టోబర్ 6: కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి కె.వినయ్ ప్రతిభ కనబరుస్తున్నారని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి తెలిపారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో 2 బంగారు పతకాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కటా, కుమిటే విభాగాలలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించి వినయ్ సంస్థకు గర్వకారణంగా నిలిచారని అన్నారు. క్రమశిక్షణ, సవాళ్ళను ఎదుర్కొనే దృఢత్వం స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాష, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర, పీఈడీ డాక్టర్ రామచంద్రరావులతో కలిసి వినయ్‌కి ఘనంగా సన్మానం చేశారు.

## అక్టోబర్ 8 వరకు ఫర్నిచర్ ఎక్స్‌పో..

జూబ్లీహిల్స్, అక్టోబర్ 6: అక్టోబర్ 6 నుంచి 8 వరకు హైటెక్ సిటీ హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫర్నిచర్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటిని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ డిజైనింగ్ ఫర్నిచర్‌తో ఈ హోమ్ ఫర్నిచర్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3 రోజులు నిర్వహించే ఈ ప్రదర్శన, విక్రయాలలో 70% గ్రాండ్ డిస్కౌంట్ ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు.

## కొనసాగుతున్న బతుకమ్మ చీరెల పంపిణీ

సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెల పంపిణీ కొనసాగుతున్నది. మూడు రోజులుగా నియోజకవర్గంలోని ఆయా పంపిణీ కేంద్రాలలో ప్రజా ప్రతినిధులు ఆడపడుచులకు చీరెలను అందజేస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం హైదరాబాద్ జిల్లాలో 15వేల చీరలను పంపిణీ చేయగా, జీహెచ్ఎంసీ వ్యాప్తంగా మూడు రోజులలో మొత్తం 3.50 లక్షల చీరెలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. 10 లక్షల చీరెల పంపిణీ కార్యక్రమం ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు చెప్పారు.

# పోగొట్టుకున్నోళ్లకు తిరిగి ఇచ్చేస్తున్నారు

## సైబర్ నేరాలను ఛేదిస్తున్న సైబరాబాద్ పోలీసులు

### 44కేసుల్లో 2.23కోట్ల డబ్బు రికవరీ

### ఇతర కేసుల్లో మరో రూ.10కోట్లు ఫ్రీజ్

### డబ్బు రికవరీకి దేశంలోనే తొలిసారిగా ఎస్ఓపీ రూపకల్పన

### బాధితులకు రికవరీ పత్రాలు అందజేసిన సీపీ స్టీఫెన్ రవీంద్ర



రికవరీ పత్రాలను అందజేస్తున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, చిత్రంలో తదితరులు

సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిన డబ్బును పెద్ద ఎత్తున రికవరీ చేసి రికార్డు సృష్టించారు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. గతంలో, ఇటీవల నమోదైన 44కేసులను ఛేదించడంతో పాటు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిన రూ.2.23కోట్లను రికవరీ చేసి, దానికి సంబంధించిన పత్రాలను బాధితులకు అందజేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రైమ్ డీసీపీ కల్మేశ్వర్, సైబర్‌క్రైమ్ డీసీపీ రితిరాజ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ విశ్వజిత్ కంపాటిలు కేసు పూర్వాపరాలను వెల్లడించారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా వాడకాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్-టైమ్ జాబ్ పేరుతో అమాయకులను బురిడీ కొట్టించి, రూ.లక్షలను దండుకుంటున్నారు.

### 44కేసుల్లో 2.23కోట్లు రికవరీ...

సైబర్ నేరగాళ్ళ మాయమాటలు నమ్మి, దురాశతో లక్షల రూపాయలు పోగొట్టుకున్న 44మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో ముందుగా ఎన్‌సీఆర్‌పీకి సమాచారం చేరవేయడంతో పాటు బాధితుల డబ్బులు ఏ ఖాతాలోకి వెళ్లాయో గుర్తించి, సంబంధిత బ్యాంక్ అధికారులను అప్రమత్తం చేయడం, డబ్బులు వచ్చిన ఖాతాను ఫ్రీజ్ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. అనంతరం బాధితులచేత కోర్టులో పిటీషన్ దాఖలు చేయించి, కేసుకు సంబంధించిన పూర్తి ఆధారాలు కోర్టుకు సమర్పించి, ఫ్రీజ్ చేసిన డబ్బులు తిరిగి బాధితులకు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వివిధ కేసుల్లో డబ్బులు పోగొట్టుకున్న 44 మంది బాధితులకు సంబంధించిన రూ. 2,23,89,575ను రికవరీ చేశారు. దీనికి సంబంధించిన కోర్టు అనుమతి పత్రాలను ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పలువురు బాధితులకు అందచేశారు. కాగా మిగతా కేసుల్లో కూడా దాదాపు 10 కోట్ల వరకు ఫ్రీజ్ చేశామని అవి న్యాయస్థానాల్లో విచారణ పూర్తవగానే ఆ కేసుల బాధితులకు కూడా న్యాయం జరగనుందని ఆయన వెల్లడించారు.

### డబ్బు రికవరీకి దేశంలోనే ..

సాధారణంగా సైబర్ నేరాలు ఛేదించడం ఇతర కేసులతో పోల్చితే కొంత క్లిష్టమైన పనే. అందులోను డబ్బులు రికవరీ చేయడం మరింత క్లిష్టమని, అందుకు పలు రకాల న్యాయపరమైన సమస్యలు, సాంకేతిక సమస్యలు ఉంటాయని, వీటిని సులభంగా అధిగమించి, బాధితులకు న్యాయం చేసేందుకు ఒక ప్రత్యేక 'స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్'(ఎస్ఓపీ)ని రూపొందించినట్లు సైబర్ క్రైమ్ డీసీపీ రితిరాజ్, క్రైమ్ డీసీపీ కల్మేశ్వర్ వెల్లడించారు.

### పోలీసులకు కృతజ్ఞతలు...

నాపేరు యశ్వంత్. మాది గాజుల రామారం. నేను సెల్‌ఫోన్ దుకాణం నడిపిస్తాను. నా బ్యాంక్ ఖాతాలో రూ.60 వేలు దాచుకున్నాను. ఒక రోజు నాకు ఒక ఫోన్ కాల్ వచ్చింది. మీరు మా కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామని చెప్పారు. ముందుగా నేను నమ్మలేదు. కాని వారు పదే పదే ఫోన్‌లు చేసి ఒక్కసారి పెట్టిచూడండి అన్నారు. పోతే పోతై లేక వస్తే వస్తై అని నేను రూ. 1000/- ఆన్‌లైన్ ద్వారా వారు ఇచ్చిన నెం బర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాను. నాకు రూ.1200 రిటర్న్ వచ్చాయి. అంటే వెయ్యికి రూ.200 వచ్చాయి. వచ్చింది తీసుకుని ఊకున్నాను. కాని వారు మళ్లీ ఫోన్ చేసి, ఇంకొంచెం ఎక్కువ పెడితే ఎక్కువ లాభం వస్తుందని నమ్మించిండ్రు. నేను రూ.5000పెట్టుబడిగా పెట్టాను. దానికి నాకు రూ.7వేలు వచ్చాయి. ఇట్లా పది, పదిహేను వేల దాకా పెట్టగా తిరిగి డబ్బులు వచ్చినయి. తరువాత వాళ్లు మాటి మాటికి ఫోన్‌లు చేసి, నా చేత ఒకేసారి రూ. 2.95లక్షలు పెట్టించిండ్రు. గంతే ఇగ రూపాయి రాలేదు. వాళ్లకు పోన్‌లు చేస్తే పనిచేస్తలేదు. ఎంబడే మాకు దగ్గర్లో ఉన్న దుండిగల్ పోలీసులకు కంప్లైంట్ చేసిన. వాళ్లు నాకు ధైర్యం చెప్పిండ్రు. మొత్తానికి నా పైసలను తిరిగి ఇప్పించిండ్రు. పోలీసులకు కృతజ్ఞతలు.

### మ్యూల్ ఖాతాల ద్వారా రూ.111కోట్లు స్వాహా... క్రైమ్ డీసీపీ రితిరాజ్

ఓ గుర్తు తెలియని వ్యక్తి 34 మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ ద్వారా దేశ వ్యాప్తంగా 811 సైబర్ నేరాలకు పాల్పడి, రూ.111కోట్లు దోచుకున్నట్లు పోలీసు అధికారులు వివరించారు. అమాయకులు, డబ్బు అవసరమున్న వారిని గుర్తించి వారిచేత బ్యాంక్ ఖాతాలు తెరిపిస్తారని, అనంతరం వారికి కొంత డబ్బు ఇచ్చి, ఆ ఖాతాలకు సంబంధించిన పాస్‌బుక్, ఖాతాకు అనుసంధానం చేసిన ఫోన్ సిమ్ కార్డు వంటివన్నీ తీసుకుంటారని వివరించారు. అనంతరం అమాయకుల నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాలోకి మార్పిడి చేసుకుని అక్కడి నుంచి వారి ఖాతాల్లోకి, ఆ తరువాత క్రిప్టో కరెన్సీకి మార్పిడి చేయడం జరుగుతుందని, పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు సైబర్ నేరగాళ్లు ఈ విధంగా మ్యూల్ ఖాతాలను వినియోగించుకుంటారని పోలీసు అధికారులు వివరించారు.

## తుర్కయంజాల్‌లో చందన బ్రదర్స్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 6: తెలంగాణ ప్రజలకు వస్త్ర రంగంలో సుపరిచితమైన ప్యాట్నీ సెంటర్ చందన బ్రదర్స్ మరో షాపింగ్ మాల్‌ను శుక్రవారం తుర్క యంజాల్‌లో ప్రారంభించారు. ఈ నూతన షాపింగ్ మాల్‌ను స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రముఖ సినీతార అను ఇమ్మాన్యూయేల్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకున్నట్లు సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ తెలిపారు. తుర్క యంజాల్‌లో నాలుగు అంతస్తులలో 15 వేల చదరపు అడుగులలో సువిశాలమైన సకుటుంబ వస్త్ర ప్రపంచం ఏర్పాటైంది. చందన బ్రదర్స్ తుర్క యంజాల్ ప్రాంతంలో అతి పెద్ద షాపింగ్ మాల్ కావడం విశేషం. ఈ షాపింగ్ మాల్‌లో అన్ని రకాల వస్త్రాలు హోల్‌సేల్ ధరలకే విక్రయిస్తున్నట్లు సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ తెలిపారు.



షో రూమ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్ రెడ్డి, పక్కన సినీ నటి అను ఇమ్మాన్యూయేల్, సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ తదితరులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ వై.భాస్కరరావు, చిత్రంలో భారతి హోలీ కేరి

## వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

రవీంద్రభారతి, అక్టోబర్ 6: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోలీకేరి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రత్యేక కార్యదర్శి భారతి హోలీకేరి, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ సంచాలకులు బి.శైలజ, మాజీ కర్ణాటక జస్టిస్ వై.భాస్కరరావు జ్యోతి హాజరై ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జస్టిస్ వై.భాస్కరరావు, పలువురి వయోవృద్ధుల జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు.

## ఆకట్టుకున్న బ్రిలియెన్స్ జువెల్లరీ షో

ఖైరతాబాద్, అక్టోబర్ 6 : సోమాజిగూడలోని జోయలుక్కాస్ షోరూంలో శుక్రవారం ఏర్పాటు చేసిన 'బ్రిలియన్స్ జువెల్లరీ షో ఆకట్టుకున్నది. అంతకు ముందు ఈ ప్రదర్శనను సంస్థ రిటైలర్ మేనేజర్ రాకేశ్ కృష్ణన్ ప్రారంభించారు. పాలిష్ చేసిన వజ్రాలు, విలువైన స్టోన్స్‌తో రూపొందించిన వజ్రాభరణాలను ఈ నెల 22 వరకు ప్రదర్శిస్తామని తెలిపారు.

